క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కృష్ణానదిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ జానయ్య

మక్తల్: ఇటీవల కురుస్తున్న భారీవర్షానికి కృష్ణానది తీరన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. మరో రెండు రోజుల పాటు వర్షం కురిసే అవకాశం ఉందని ప్రజలు పురాతన, ఇండ్లలో ఉండకుండా సురక్షితమైన ప్రదేశంలో ఉండాలని, చెరువులు, కుంటలు నిండుతున్నాయని, వాటి పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవరైన ఆపదలో ఉంటే 100కి పోన్‌చేయాలని కోరారు.

కోస్గి: మండల పరిధిలోని పలు వాగులు ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తుండటంతో అధికారులు అప్రమత్తమై ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు. బిజ్జారం వాగు, ముంగిమళ్ల వాగు గ్రామాలకు నిర్మించిన వంతెనల పైనుంచి ప్రవహిస్తుండటంతో ప్రజలు గ్రామాలకు పరిమితమయ్యారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు అప్రమత్తమై ఆయా గ్రామాల వద్ద బందోబస్తు ఏర్పాటుచేసి రాకపోకలు నిలిపి వేశారు.

పెరుగుతున్న కృష్ణానది ఉధృతి

కృష్ణా: కృష్ణానదికి ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి దిగువకు 2లక్షల క్యూసెక్కుల వరకు నీటిని దిగువకు వదులుతుండటంతో నది ఒడ్డున ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎండీ నవీద్ హెచ్చరికలు జారీ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎగువన ఉన్న ప్రాజెక్టుల నుంచి దిగువకు అధిక మొత్తంలో నీటిని వదులుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. లాలగే మండల కేంద్రంలోని కృష్ణానదిని ఆదివారం సాయంత్రం ఎంపీడీఓ జానయ్య నది ఉధృతిని పరిశీలించారు. ఈమేరకు.. స్థానిక ప్రజలతో మాట్లాడుతూ.. నది పరిసరాల్లోకి ఎవరూ కూడా వెళ్లొద్దని, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

కృష్ణా: మండలంలోని ఆలంపల్లి శివారులో ఓ చిన్నపాటి కుంటా ఆదివారం కురిసిన భారీ వర్షాలకు తెగిపోయింది. పంటపొలాలు దెబ్బతింటున్నాయని బాధిత రైతులు తెలిపారు. ఈ విషయంపై అధికారులు స్పందించి తగిన మరమ్మతు చేయించాలని కోరారు. అందుకు స్పందించిన ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి వెంటనే నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం అందించారు.

అప్పంపల్లి చెరువుకు గండి



మరికల్: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అప్పంపల్లి శివారులోని రాప్తాన్‌కుంటకు గండి పడింది. ఆదివారం వరదనీరు ఉధృతంగా రావడంతో కుంటకు గండిపడి పొలాలు నీటిలో మునిగాయి. వెంటనే తెరుకున్న అక్కడి రైతులు తాత్కాలిక మరమ్మతు చేపట్టిన గండిని పూడ్చలేకపోయారు. అధికారులు స్పందించి వెంటనే రాప్తాన్‌కుంటకు పడ్డ గండిని మరమ్మతు చేయాలని రైతులు అంజిల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, మాస్‌రెడ్డి కోరారు.

వరదనీటిలో వ్యక్తిని రక్షించిన గ్రామస్తులు



ఊట్కూర్: మండలంలోని పగిడిమారి బ్రిడ్జిపై వర్ద నీటిలో కొట్టుకోపోతున్న శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తిని గ్రామానికి చెందిన యువకులు జేసీపీ, తాళ్ల సాయంతో కాపాడారు.. ప్రాణాలకు తెగించి బాధితుడిని రక్షించిన యువకులు అబు బాకర్, కుర్వ ఉసెనప్పలకు గ్రామస్తులు అభినందించారు.

శాశ్వత కాల్వలు నిర్మించాలి..

మరికల్: మండలంలోని పెద్ద చెరువు అలుగు పారితే వచ్చే నీరు వెళ్లడానికి అధికారులు శాశ్వత కాల్వలు నిర్మించాలని బీఆర్ఎస్ మండల నాయకులు బసంత్, శేఖర్ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పెద్ద చెరువు నిండి అలుగు పారడంతో రెండు రోజుల నుంచి జాతీయ రహదారిపై నీళ్లు పారడంతో ప్రమాదం పొంచి ఉందన్నారు. భవిష్యత్‌లో వచ్చే వరద నీటితో గ్రామస్తులకు ఎలాంటి ప్రమాదం జరగకుండా, ఇళ్లలోకి నీళ్లు రాకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు.



ఉధృతంగా ప్రవహిస్తున్న భూనీడ్ వాగు



కోస్గిలో రాకపోకలు నిలిపి వేసిన అధికారులు

నిండిన చెరువులు, కుంటలు

- పలు గ్రామాల్లో కూలిన ఇళ్లు
- నీటి మునిగిన పంటలు



మరికల్, జిన్నారం వద్ద వంతెనపై ఉధృతంగా పారుతున్న మన్నేవాగు



నారాయణపేటలో ఉధృతంగా ప్రవహిస్తున్న అభంగాపూర్ వాగు

నారాయణపేట రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలు నిండుకుండను తలపిస్తున్నాయి. ఇప్పటికే మండలంలోని జాజాపూర్– శేర్నపల్లి, అభంగాపూర్–బండగొండ, చిన్నజట్రం – బోయిన్‌పల్లి, సింగారం – నక్క రామయ్య కాలనీల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. నెమలపల్లి జాతరకు వచ్చే భక్తులు తిరుగుప్రయాణంలో కల్వర్టు వద్ద వర్షపునీరు పారుతుండటంతో ఇబ్బందులు పడ్డారు. కోటకొండ చెరువు పూర్తిగా నిండి అలుగుపారగా సమీప పంట పొలాల్లోకి నీరుచేరింది. అలాగూ సింగారం వద్ద రెండుచోట్ల చెట్లు నేలరాటడంతో మక్తల్ వైపు రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. రెవెన్యూ, పోలీసు వ్యవస్థలు సమన్వయంతో పనిచేస్తూ సహాయం చేస్తున్నారు.

మక్తల్: పట్టణంలో ఎస్‌బీఐ బ్యాంకు వద్ద నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అలాగే శ్రీరాంనగర్‌వీధి, అంబేడ్కర్‌నగర్, శ్రీరామ్‌నగర్ కాలనీలో వర్షపునీరు చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పలు కాలనీలో పర్యటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే సంగంబండ రిజర్వాయర్‌ను ఇరిగేషన్ అధికారులు ఈఈ శివప్రసాద్, డీఈ సురేష్ సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ బోగేశ్వర్ కాలనీల్లో పర్యటించి సహాయక చర్యలు ఏర్పాటుచేసి ప్రజల ఇబ్బందులను తొలగించారు. రుద్రసముద్రం వద్ద బ్రిడ్జిపై వర్షపునీరు పారుతుండటంతో రాకపోకలు నిలిచిపోవడంతో జేబీసీ సాయంతో సహాయక చర్యలు చేపట్టారు.

దామరగిద్ద: వర్షాల కారణంగా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జయరాములు పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దామరగిద్దకు చెందిన బాడలి సిద్దప్ప పెంకుటిల్లు పూర్తిగా కూలిపోయింది. ఇక విఠలపూర్‌లోని మాల లక్ష్మమ్మ, శరణప్ప, అవుసలి సదానందం, అంజిలమ్మ, అనంతమ్మ, రాజు, భీంషప్ప ఇల్లు కూలి నిరాశ్రయులు కాగా తహసీల్దార్ జయరాములు పర్యవేక్షించి స్థానిక ప్రభుత్వ పాఠశాల భవనంలో వారికి ఆశ్రయం కల్పించి నిత్యవసర సరుకులు అందజేశారు. ఆశన్‌పల్లిలోని చాకలి కృష్ణయ్య, బస్సప్ప, పింజరి మైముద ఇల్లు వర్షానికి కూలిపడ్డాయి. దేశాయ్‌పల్లి చెరువుకు గండి పడగ తహసీల్దార్ పర్యవేక్షణతో జేసీబీతో గండిని పూడ్చారు.

మద్దూరు: మద్దూరు, కొయిలకొండ మీదుగా మహబూబ్‌నగర్ వెళ్లే బస్సులను ఆర్‌టీసీ అధికారులు నిలిపివేశారు. ఈ రూట్‌లో నిడ్జింత, లింగల్ చేడ్ దగ్గర వాగు ఉధృతంగా పారుతుండంతో బస్సుల రాకపోకలను నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. భూనీడ్ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండంతో భూనీడ్, దుప్పట్‌గట్, కిషన్‌నగర్, గొల్లగడ్డ, అల్లీపూర్ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

నర్వ: మండలంలోని యాంకి చెరువు నిండి అలుగు పారుతుండడంతో గజ్జలమ్మ వాగులోకి వస్తున్నాయి. దీంతో గజ్జలమ్మ వాగుపై ఉన్న కాజ్‌వేపై నీళ్లు పొంగిపొర్లుతూ పెద్దకడ్మూర్ వద్ద ఉన్న బ్రిడ్జి తాకుతూ వెళ్తున్నాయి. తహసీల్దార్ మల్లారెడ్డి, ఎస్ఐ కురుమయ్య తమ సిబ్బందితో మండలంలోని సందర్శించి ప్రజలు అప్రమత్తంగా సూచించారు.

ధన్వాడ: మండలంలోభారీ వర్షానికి అన్ని చెరువులు నిండు కుండల తలపిస్తున్నాయి. ధన్వాడ పెద్ద చెరువులోకి నీరు వస్తుండటంతో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెరువుకు ఎడమవైపు గండి కొట్టి నీటిని కిందకు వదలారు. దీంతో కుర్వ విధిలోకి వెళ్లే దారిలో ఉన్న కల్వట్లుపై నీరుపారుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న గజ్జెలమ్మ ఆలయం వర్షానికి కూలిపోయింది.



నారాయణపేట మండలం అయ్యవారిపల్లిలో కూలిన ఇళ్లు

వర్షానికి కూలిన ఇళ్లు

కోస్గి: మండల పరిధిలోని కడంపల్లి–హన్మాన్‌పల్లి గ్రామాల మధ్యవాగులో నిర్మించిన మట్టి రోడ్డు ఆదివారం భారీవర్షానికి కొట్టుకోపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ముంగిమళ్ల, బిజ్జారం గ్రామాలకు సంబంధించి వాగులపై నిర్మించిన వంతెనలు నీటిలో పైనుంచి నీరు ప్రవహిస్తూ ప్రమాదకరంగా మారింది. అప్రమత్తమైన అధికారులు ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిపి వేశారు. బిజ్జారం వాగులో ముళ్లకంచె వేసి రాకపోకలు నిలిపివేశారు. సర్జఖాన్‌పేట, నాచారం గ్రామాల్లో రెండు పురాతన ఇళ్లు కూలిపోయాయి.

మద్దూరు: మద్దూరులో చింతల్‌దిన్నే గ్రామానికి చెందిన శివగిరి గంగప్ప, మోమినాపూర్ గ్రామానికి చెందిన జీడి నిరంజమ్మ ఇండ్లు ఆదివారం కూలిపోయాయి. అలాగే మద్దూరులోని నాగిరెడ్డి కుంట కట్టకు నిర్మించిన గొడ కూలిపోవడంతో రెవెన్యూ అధికారుల, స్థానిక నాయకులు వెంటనే స్పందించి కూలిపోయిన గోడకు టిప్పర్ల సాయంతో మట్టిని కొట్టి చెరువు కట్టను పటిష్టం చేశారు. ఈ చెరువు గండి పడితే రెండు చెరువులకు గండిపడే ప్రమాదం ఉండడంతో మట్టికొట్టే పనులు చేయించినట్లు తహసీల్దార్ మహేష్‌గౌడ్ తెలిపారు.

ఊట్కూర్: అదేవిదంగా ఊట్కూరు పెద్ద చెరువులో వరదనీరు చేరడంతో ఆదివారం ఉదయం అలుగు పారింది. మండలంలోని శివారులోని బ్రిడ్జిపై నీరుపారడంతో గ్రామానికి రాకపోకలు నిలిచాయి. ఊట్కూరులో ఐదు మట్టి ఇండ్లు కూలిపోయాయి. చిన్నపొర్ల, పులిమామిడి రోడ్డుపై భారీ చెట్టు విరిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఊట్కూరు చెరువు వద్ద ఎస్ఐ కృష్ణం రాజు ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ ధనుంజయగౌడ్, ఎస్ఐ కృష్ణంరాజు మండలంలో తిరుగుతూ వరద ఉధృతిని అంచనా వేశారు.

మాగనూర్: మండలంలోని మందిపల్లి, కొల్పూర్, కొత్తపల్లి గ్రామాల్లో ఆదివారం తెల్లవారు జామున భారీ వర్షానికి మట్టి ఇళ్లు కూలిపోయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అయితే అదృష్టవశాత్తు ఎక్కడ కూడా ప్రాణ నష్టం జరగలేదన్నారు. ఆర్ఐ శ్రీశైలం కూలిపోయిన ఇళ్లను పరిశీలించి పంచనామా నిర్వహించారు.



మోమినాపూర్‌లో..



మాగనూర్‌లో..

మరికల్: మరికల్, కన్మనూర్ మధ్యన మన్నేవాగుపై వరద రావడంతో రెండు గ్రామాల మధ్యన రెండు రోజులనుంచి రాకపోకలు నిలిచిపోయాయి. దాదాపు 16ఇళ్లు కూలిపోయాయి. మరికల్ పెద్దచెరువు అలుగు పారడంతో వరద నీళ్లు జాతీయ రహదారిపై నుంచి పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కిష్టంపల్లి, రోడ్డు పక్కన ఇళ్లు, అశోక్‌నగర్‌లోని ఇళ్లలోకి వర్షపు నీరుచేరాయి. ఈ చెరువు నుంచి భారీగా చేపలు బయటకు పోవంతో పొలాల్లోకి గ్రామస్తులు చేపలు పడుతున్నారు.



మక్తల్లో బ్యాంకు ఎదుట నిలిచిన వర్షపు నీరు



మరికల్ జాతీయ రహదారిపై పారుతున్న వరద



అలుగు పారుతున్న ధన్వాడ పెద్ద చెరువు



నర్వలో అలుగు పారుతున్న యాంకి చెరువు



అలుగు పారుతున్న కాచువాగు చెరువు

శిథిల ఇళ్ల తొలగింపు



పేటలోజ శిథిలావస్థకు చేరిన ఇళ్లను జేసీబీతో తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నారాయణపేట: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో స్థానిక మున్సిపాలిటీ తడిసి ముద్దయింది. కొండరెడ్డిపల్లి చెరువు అలుగుపారడంతో అన్నదాతలు ఆనందంలో మునిగిపోయారు. పట్టణంలోని పలు వార్డుల్లో శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది జేసీబీ సాయంతో కూల్చివేశారు. పట్టణంలోని పలు వార్డులో కౌన్సిలర్లు పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతమైన ఏడో వార్డులోని భివండీకాలనీ, గాయత్రీనగర్, అశోక్‌నగర్‌లలో ఆదివారం వార్డు కౌన్సిలర్ ఎండీ సలీం పర్యటించారు. ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని కోరారు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చెన్నకేశవులు, శ్రీనివాస్, ఖుద్దుస్, అప్సర్ పాషా ఉన్నారు.

ఆర్ఐ సరెండర్

మరికల్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేసిన ఆర్ఐ శ్రీశైలంను కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టర్ కార్యాలయానికి సరెండర్ చేసినట్లు తహసీల్దార్ జమీల్ తెలిపారు. మరికల్ పెట్రోల్ బంక్ వద్ద ఆదివారం వరదనీరు జాతీయ రహదారిపైకి రావడంతో అక్కడ విధులు నిర్వహించకుండా మధ్యాహ్న సమయంలో ఎక్కడికి వెళ్లావని గ్రామస్తులు ఆయనను నిలదీశారు. ఈ విషయంపై పొంతనలేని సమాధానం చెప్పిన ఆర్ఐపై చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్ఐ కలెక్టర్ కార్యాలయానికి పంపించినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



దామరగిద్ద: మండల కేంద్రంలోని రెయిన్‌బో స్కూల్ ఆవరణలో ఆదివారం శంకర్ కంటి ఆస్పత్రి హైదరాబాద్ వైద్యులచే సక్షం–తెలంగాణ అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. సక్షమ్ జిల్లా ప్రధానం కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్ సమక్షంలో వైద్యులు ప్రణయ్, శివరంగ ఇతర వైద్య సిబ్బంది కంటి పరీక్షలు చేశారు. దాదాపు 140మందికి కంటి సమస్య ఉన్న వారికి పరీక్షలు నిర్వహించారు. రమేష్, ఇండ్ల మాణిక్, సతీష్, దస్తగిరి పాల్గొన్నారు.

‘బ్రిక్స్’ సదస్సుకు ఎంపిక

మరికల్: దక్షిణ అఫ్రికలో ఈ నెల 3 నుంచి 6 వరకు జరిగే బ్రిక్స్ దేశాల విద్యా సదస్సుకు మరికల్‌కు చెందిన న్యాయవాది అయ్యప్ప ఎంపికైనట్లు ఆ దేశ బ్రిక్స్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రేమాండ్ నుంచి తనకు ఉత్తర్వులు అందినట్లు ఆయన ఆదివారం తెలిపారు. బ్రిక్స్ దేశాల విద్యా సదస్సుకు మరికల్ నుంచి నాకు అవకాశం రావడం గౌరవంగా ఉందన్నారు. అక్కడ సంస్కృతిక ఆర్థిక విద్య వైజ్ఞానిక నూతన ఆవిష్కరణల గురించి చర్చలు జరుగుతాయన్నారు. ఈ సమావేశాలకు బ్రిక్స్ దేశాలకు చెందిన 18 నుంచి 35 ఏళ్లలోపు ఉన్న యువత హాజరవుతారని తెలిపారు.

వైభవంగా కలశ ఊరేగింపు



పులిమామిడిలో కలశ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఊట్కూరు: మండలంలోని పులిమామిడిలో ఆదివారం రామలింగేశ్వర స్వామి కలశ ఊరేగింపును భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు.. స్వామివారి కలశ ఊరేగింపును చేపట్టారు. అనంతరం స్వామివారికి పంచామృతాభిషేకం, అలంకరణ తదితర ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం సాయంత్రం వజ్రోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ అధ్యక్షుడు తంబలి బస్వరాజ్, రవికుమార్, దానప్ప, రాజ్‌కుమార్, రాజశేఖర్, జంగం సునిల్, విజయ్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

మక్తల్: పట్టణంలోని ఆదివారం శ్రీమల్లికార్జున స్వామి ఆలయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాతృమూర్తి వాకిటి రాములమ్మ, పూజారి తిప్పయ్యస్వామికి 1 కేజీ 13 తులాల వెండిని వితరణ చేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జూరాల వద్ద పోలీసుల పహారా

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి పర్యాటకులను అనుమతించడం లేదని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం సెలవు కావడంతో జూరాల ప్రాజెక్టు సందర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివస్తుంటారనే సమాచారంతో ఉదయం నుంచే ప్రాజెక్టు వద్ద రహదారిని మూసి ఉంచి పర్యాటకులను అనుమతించడం లేదన్నారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా.. ఎగువ నుంచి వస్తున్న వరదతో జూరాల వద్ద కృష్ణానది ఉగ్రరూపం దాల్చుతుందని ఎస్ఐ తెలియజేశారు. జూరాల బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టడానికి జాలర్లు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. జూరాల ప్రాజెక్టుపై గద్వాలకు వెళ్తున్న ప్రయాణికులు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పుష్కరఘాట్‌తో పాటు ఎడమ కాల్వ వద్ద చేప వంటకాల వద్ద పర్యాటకులు కాల్వలో దిగకుండా తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించామని చెప్పారు.



జూరాల ప్రాజెక్టు వద్ద పహారా కాస్తున్న పోలీసులతో ఎస్ సురేష్

సీపీఎస్‌ను రద్దు చేయాలి..



పేటలో నిరసన ర్యాలీ చేస్తున్న జేఏసీ నాయకులు

నారాయణపేట రూరల్: సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వక్తలు కోరారు. ఆదివారం పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో నల్ల బ్యాడ్జీలు ధరించి స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి మున్సిపల్ పార్క్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నానుద్దేశించి జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయుల కష్టార్జితాన్ని కార్పొరేట్ గుత్త సంస్థలకు దోచిపెట్టి వృద్ధాప్యంలో రిటైర్డ్ ఉద్యోగులను ఆర్థిక యాతనకు గురిచేయడం దారుణమన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఉపాధ్యాయ ఉద్యోగులకు ఇచ్చిన పాత పెన్షన్ అమలు హామీని ప్రభుత్వం నెరవేర్చాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు శేర్ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సంఘాల నేతలు వై జనార్ధన్‌రెడ్డి, బాలాజీ, రెడ్డప్ప, శ్రీనివాస్, రాంరెడ్డి, నారాయణ, సంతోష్‌కుమార్, రఘువీర్, జనార్ధన్, భీమయ్య, అనిల్, ప్రకాష్, వాల్యానాయక్, దశరత్, రమేష్, నరేష్, అరవింద్, విశ్వనాథ్, సాయప్ప, విజయ కుమార్, శ్రీనివాస్, సందీప్, పాల్గొన్నారు.

కోస్గి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం రద్దు చేసి సీపీఎస్ విధానం అమలు చేయాలని నిరసిస్తూ ఆదివారం ఉద్యోగ, ఉపాధ్యాయ మరియు పెన్షనర్ల ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించి స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ మేరకు.. పెన్షనర్ల ఐక్యవేదిక ప్రతినిధి రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. పాత పెన్షన్‌ను రద్దు చేసి సీపీఎస్ విధానం అమలు చేయాడాన్ని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తున్నామన్నారు. ఈ విధానం రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మక్తల్‌లో..

మక్తల్: ఉపాధ్యాయుల తమ సమస్యలు పరిష్కరించాలని జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆదివారం నల్లబ్యాడ్జీలు ధరించి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, పరందాములు, శ్రీకాంత్, శ్రీనివాసులు, బాబు తదితరులు పాల్గొన్నారు.



కోస్గిలో..

తప్పిన ప్రమాదం..

అమరచింత: పట్టణంలోని పశువైద్యశాల ఆవరణంలోని 11 కేవీ విద్యుత్ స్తంభంపై చెట్టు విరిగిపడటంతో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో ప్రమాదం తప్పింది. విరిగిపడిన విద్యుత్ స్తంభం బరువుకు బిలకంటి రాంమ్మోహన్ శెట్టి ఇంటి ముందున్న విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉందని గమనించి లైన్‌మన్ రాజుకు సమాచారం ఇచ్చారు. వెంటనే వాటిని తొలగించి, వాటి స్థానంలో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేశారు. కురుస్తున్న వర్షాలకు పట్టణంలో విద్యుత్ అంతరాయం కలుగకుండా తగు చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు.



అమరచింత పశువైద్యశాలలో విరిగిపడిన విద్యుత్ స్తంభం